## క్లుప్తంగా

### 13 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

**నవాబుపేట:** మండలంలో 13 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం గుర్తించిందని మండల వ్యవసాయ అధికారి కృష్ణకిశోర్ శుక్రవారం తెలిపారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో కూచూర్, కొండాపూర్, పోమాల్, ఇప్పటూర్, కారుకొండ, యన్మన్‌గండ్ల 6 కేంద్రాలు, అలాగే ఐకేపీ మహిళా సంఘాల ద్వారా లింగంపల్లి, చూడూర్, కొల్లూర్, గురుకుంట, లోకిరేవు, కాకర్లపహాడ్‌ను ఎంపిక చేసి కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. మండల కేంద్రంలో మార్కెటింగ్ శాఖ ద్వారా కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. మండలంలో దాదాపుగా 36,762 క్వింటాళ్ల ధాన్యం వచ్చేందుకు అవకాశం ఉందని గుర్తించినట్లు తెలిపారు. ఇప్పటికే 9 కేంద్రాలు ప్రారంభించగా, మరో 4 కేంద్రాలు త్వరలో ప్రారంభిస్తామని ఆయన వివరించారు.

### కార్యదర్శుల సమ్మెకు ఆర్థికసాయం



**జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్):** రెగ్యులర్ చేయాలనే డిమాండ్‌తో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు దేవరకద్ర సర్పంచ్ కొండ విజయలక్ష్మి తన వంతుగా రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. శుక్రవారం స్థానిక ధర్నా చౌక్‌లోని శిబిరాన్ని సందర్శించిన మద్దతు తెలిపారు. ఆమె మాట్లాడుతూ సమ్మె కాలంలో జీతాలు రాక ఆర్థిక ఇబ్బందుల్లో కార్యదర్శులు ఉన్నారని తెలిపారు. సమ్మెకు అవసరమైన వసతులు కల్పించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్, నర్మద, రఘుపతి రెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

### వీరహనుమాన్ ఆలయం ముస్తాబు



**మహమ్మదాబాద్:** మండలంలోని గాధిర్యాల్‌లో వీర హనుమాన్ జయంతి పురస్కరించుకుని రెండు రోజులపాటు ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులకు తెలిపారు. పరిశుద్ధానంద స్వామి ఆధ్వర్యంలో శనివారం ఉదయం యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, మహాగణపతి గౌరీపూజ స్వామివారికి ప్రత్యేక పూజలు, శ్రీరామ, రుద్ర హోమ కార్యక్రమాలు, అనంతరం భక్తులకు తీర్థ అన్నదాన ప్రసాదం. ఆదివారం హనుమాన్ జయంతి సందర్భంగా స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు, తెల్లవారుజామున రథోత్సవం, గంగాదేవి పూజ, అభిషేకం పూర్ణాహుతి, సాయంత్రం పల్లకీసేవ, బొడ్రాయికి బోనాలు తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

### విద్యార్థినికి అండగా ఉంటాం

**అడ్డాకుల:** మూసాపేట మండల కేంద్రానికి చెందిన బీసం వైష్ణవి పదో తరగతిలో 10 జీపీఏ సాధించడంతో శుక్రవారం బీజేపీ నియోజకవర్గ నాయకుడు బాలన్న ఆమెను సత్కరించారు. ఈ సందర్భంగా ఆమెకు రూ.5వేల నగదును అందజేశారు. ఉన్నత చదువులకు ఆర్థిక ఇబ్బందులు పడకుండా తగిన సాయం అందజేస్తానని తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు.

### కళాశాలల గుర్తింపు రద్దు చేయాలి: ఏబీవీపీ

**మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్:** గురునానక్, శ్రీనిధి కళాశాలల గుర్తింపు రద్దు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని పాలమూరు యూనివర్సిటీలో ఏబీవీపీ నాయకులు శుక్రవారం నిరసన తెలిపారు. శాంతియుతంగా విద్యామండలి వద్ద నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులపై పోలీసులు అరెస్టు చేసి విచక్షణా రహితంగా కొట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కావ్య, ప్రశాంతి, మనీష, శ్రావణి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

### చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

**కోయిల్‌కొండ:** మండలంలోని శేరివెంకటాపూర్ చెందిన వృద్ధురాలు పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బాలమ్మ(71) చిన్నతనంలోనే మృతురాలు భర్తను విడిచి శేరివెంటాపూర్‌కు వచ్చి తమ్ముడు బాలయ్యతో కలిసి ఉంది. కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడేది. ఈనెల 10వ తేదీన కడుపు నొప్పి విపరీతంగా రావడంతో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగింది. వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించడం జరిగింది. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

# స్వరాష్ట్రంలో పండుగలకు ప్రాధాన్యత



కావేరమ్మపేటలో బోనాలతో మహిళలు



హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డా. లక్ష్మారెడ్డి

**జడ్చర్ల టౌన్:** స్వరాష్ట్రం సాధన తరువాతే మన పండుగలకు, సంప్రదాయాలకు ప్రాధాన్యత పెరిగిందని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం కావేరమ్మపేట బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. అందరూ కలిసిమెలసి సామరస్యంగా పండగలు చేసుకోవడం సంతోషాన్ని ఇస్తుందన్నారు. ఉత్సవాల్లో భాగంగా హోమం, పూర్ణాహుతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం బొడ్రాయి ప్రతిష్ఠాపనకు పూజలు చేశారు. ప్రతిష్ఠ అనంతరం గ్రామ ఆడపడుచులు నీళ్లతో అభిషేకాలు చేసి ఇళ్ల వద్దకు వెళ్లి గడపలు కడిగారు. అనంతరం సామూహిక బోనాలు సమర్పించారు. ఉత్సవాలకు జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, త్రిపుర సుందరి హాజరై పూజలు చేశారు.

**ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం**

**మిడ్జిల్:** మండలంలోని మల్లాపూర్‌లో లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయ నిర్మాణ పనులను శుక్రవారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామస్తులు అందరూ ముందుకొచ్చి ఆలయ నిర్మాణం చేపట్టడం ఎంతో సంతోషమని తెలిపారు. అనంతరం ఇటీవల ఇంటర్ మొదటి సంవత్సరంలో కొత్తూర్ చెందిన జాహ్నవికి 467 మార్కులు రావడంతో ఆమెను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుదర్శన్, సర్పంచ్ జంగారెడ్డి, బాలు, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

**విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు**

మండలంలోని వాడ్యాల్‌లో బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు శుక్రవారం హోమాలు నిర్వహించారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో కాటమయ్య బోనాలు చేపట్టారు.

**భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు**

**అడ్డాకుల:** మండలంలోని బలీదుపల్లిలో శుక్రవారం విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. గ్రామంలో నిర్మించిన దేవాలయంలో గణపతి, లోకేశ్వరస్వామి, సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠతో పాటు బొడ్రాయి, కురుమూర్తి దీపస్తంభం ప్రతిష్ఠ చేయనున్నారు. ఇందులో భాగంగా మూడు రోజుల పాటు సాగే కార్యక్రమాల్లో మొదటి రోజు గోపూజ, గణపతిపూజ, అగ్నిప్రతిష్ఠతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. జెడ్పీటీసీ సభ్యుడు .రాజశేఖర్‌రెడ్డి ఉత్సవాలకు హాజరై పూజల్లో పాల్గొన్నారు.

**గ్రామదేవతలకు పూజలు**

**రాజాపూర్:** మండలంలోని రాయపల్లిలో శుక్రవారం కోటమైసమ్మ, బొడ్రాయి, పోతురాజుల విగ్రహాలకు గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. గ్రామంలోని ముఖ్య కూడలిలో హోమగుండాలు నిర్వహించి వేదపండితుల ఆధ్వర్యంలో గణపతి హోమం, పూజలు నిర్వహించారు. గ్రామంలో ప్రతిష్ఠించేందుకు ఆళ్లగడ్డ నుంచి తీసుకువచ్చిన బొడ్రాయి, పోతురాజు, కోటమైసమ్మ విగ్రహాలకు జలాభిషేకం, పుష్పాభిషేకం నిర్వహించారు. శనివారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సర్పంచ్ గంగాధర్‌గౌడ్ పేర్కొన్నారు.



మిడ్జిల్‌లో హోమం నిర్వహిస్తున్న భక్తులు



మిడ్జిల్‌లో బోనాలతో గ్రామస్తులు

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన



మెట్టుగడ్డ వద్ద బీటీరోడ్డు పునరుద్ధరణ పనులకు భూమిపూజ చేసిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** జిల్లా కేంద్రంలో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు శుక్రవారం రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ శంకుస్థాపన చేశారు. వీటిలో జీజీహెచ్ వద్ద రూ.3.5 కోట్లతో నిర్మించే ఫుట్ ఓవర్ బ్రిడ్జి, మెట్టుగడ్డ డైట్ కాలేజీ నుంచి పిల్లలమర్రి వరకు 2.85 కి.మీ. బీటీ రోడ్డు పునరుద్ధరణ ఉన్నాయి. అలాగే కొత్తగంజ్‌లోని పోచమ్మ టెంపుల్ సమీపంలో జరిగిన బొడ్రాయి ప్రతిష్ఠాపనకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. ఆయా కారక్రమాల్లో జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు గోపాల్‌యాదవ్, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, వైస్ చైర్మన్ గణేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, కమిషనర్ ప్రదీప్‌కుమార్, కౌన్సిలర్ కిశోర్‌కుమార్, పాపారాయుడు, రామకృష్ణ పాల్గొన్నారు.

# సీఎం కప్ క్రీడలను విజయవంతం చేద్దాం



అధికారులతో ఎంపీ మన్నె శ్రీనివాస్

**నవాబుపేట:** ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈ నెల 15 నుంచి నిర్వహించే సీఎం కప్ క్రీడలను విజయవంతం చేయాలని ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎంపీపీ అనంతయ్య అధ్యక్షతన నిర్వహించిన క్రీడల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలు సూచనలు చేశారు. మూడు రోజుల పాటు నిర్వహించే క్రీడలకు అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని సూచించారు. మండల స్థాయిలో 15న ప్రారంభం కానున్న క్రీడలకు, 14వ తేదీలోపు గ్రామాల క్రీడాకారులు తమ పేర్లను కార్యదర్శుల ద్వారా నమోదు చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బధ్రునాయక్ సూచించారు. ఈ క్రీడలు 15వ తేదీ నుంచి 17వ తేదీ వరకు మండల కేంద్రంలో ఉంటాయని తెలిపారు.

**మహబూబ్‌నగర్ క్రీడలు:** మహబూబ్‌నగర్ గ్రామీణ, మున్సిపల్ (అర్బన్) మండలాలకు సంబంధించి జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియం సీఎం కప్ క్రీడాపోటీలు 16వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 15–36 ఏళ్లలోపు బాల, బాలికలు, పురుష, మహిళా క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. 100, 200మీటర్ల పరుగు, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, ఫుట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాల్గొనే క్రీడా జట్లు తమ పేర్లను ఈనెల 15న సాయంత్రం 3 గంటలలోపు స్టేడియంలో డీవైఎస్‌ఓ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని కోరారు.

**జడ్చర్ల టౌన్:** ఈనెల 15నుంచి రెండు రోజుల పాటు స్థానిక స్టేడియం మైదానంలో మండల స్థాయి సీఎం కప్ క్రీడలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఉమాదేవి తెలిపారు.

**హన్వాడ:** మండల స్థాయి క్రీడల నిర్వహణపై అధికారులతో శుక్రవారం ఎంపీపీ బాల్‌రాజ్ అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఆసక్తి గలవారు పంచాయతీలకు, పీఈటీలకు సమాచారం ఇవ్వాలని అన్నారు.

**గండీడ్:** సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనే వారు వివరాలు ఇవ్వాలని ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు.

# దెబ్బతిన్న పంటల పరిశీలన



కుచ్చర్‌కల్‌లో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు

**రాజాపూర్:** ఇటీవల కురిసిన వడగండ్లవానకు దెబ్బతిన్న పంటలను వ్యవసాయశాఖ శాస్త్రవేత్తలు పరిశీలించారు. మండలంలోని కుచ్చర్‌కల్‌లో శుక్రవారం ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ భరత్‌భూషన్, అర్చన, ఏఓ అధికారి నరేందర్ వరి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వడగండ్లతో పాటు అధిక వర్షంతో పంటలు దెబ్బతిన్నాయని, వివరాలను ఉన్నతాధికారులు సమర్పించనున్నట్లు ఏఓ పేర్కొన్నారు. కష్టపడి పండించిన పంటలు చేతికొచ్చేముందు అందకుండా పోయాయని, ప్రభుత్వం నుంచి సాయం అందించే విధంగా చూడాలని అధికారులను రైతులు వేడుకున్నారు.

### దళితరత్న అవార్డుల ప్రదానం



**మహబూబ్‌నగర్ రూరల్:** మాల మహానాడు ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు బ్యాగరి శ్రీనివాసులు, సహాయ కార్యదర్శి చెన్నయ్యలకు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దళితరత్న అవార్డులు ప్రదానం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో అవార్డుల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి ఎడ్ల కృష్ణయ్య, యాదయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న వేసవి కరాటే శిక్షణ



విద్యార్థులకు కరాటే శిక్షణ ఇస్తున్న జహంగీర్‌పాషా ఖాద్రీ

**మహబూబ్‌నగర్ క్రీడలు:** కింగ్‌షోటోకాన్ కరాటే క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మహాత్మాగాంధీ రోడ్డు స్కూల్ ఆవరణలో నిర్వహిస్తున్న 25వ వేసవి ఉచిత కరాటే శిక్షణా శిబిరం కొనసాగుతుంది. క్లబ్ ఫౌండర్ జహంగీర్‌పాషా ఖాద్రీ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహిస్తున్నారు. ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 4వ తేదీ వరకు శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు విద్యార్థులకు, యువతకు ఉదయం 6 గంటల నుంచి 7:30 గంటల వరకు శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఆదివారం కిక్‌బాక్సింగ్, జూడో, కర్రసాము, యోగా అంశాల్లో శిక్షణ ఇస్తామన్నారు. ఈ నెల 14వ తేదీన కరాటే శిబిరంలో విద్యార్థులకు యోగా గురువులచే ప్రత్యేకంగా అవగాహన కల్పించడంతోపాటు శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి



**మహబూబ్‌నగర్ రూరల్:** ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా పంచాయతీరాజ్ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండలంలోని కోటకదిరను ఆయన సందర్శించి ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, కంపోస్ట్ షెడ్, నర్సరీ, మురుగు కాల్వలు, రోడ్లు, ఇతర అభివృద్ధి పనులను పరిశీలించారు. డీపీఓ మాట్లాడుతూ గ్రామంలో వందశాతం మరుగుదొడ్ల వినియోగంలో ఉండాలని సూచించారు. ప్రభుత్వం మంజూరు చేసే నిధులతో సమస్యలు ఉన్న ప్రాంతాలను గుర్తించి పరిష్కరించేందుకు కేటాయించాలని అన్నారు.

### దివ్యాంగులకు సదరం క్యాంప్

**చిన్నచింతకుంట:** ఈ నెల 16వ తేదీ నుంచి 31 వరకు మహబూబ్‌నగర్ జిల్లా జనరల్ ఆస్పత్రిలో దివ్యాంగులకు సదరం క్యాంప్ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండలంలోని దివ్యాంగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

### ఏఎన్‌ఎంల సేవలు ప్రశంసనీయం

**భూత్పూర్:** ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు ఏఎన్‌ఎంలు చేసే సేవలు ప్రశంసనీయమని మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని మైనార్టీ కమ్యూనిటీ హాల్‌లో ప్రపంచ నర్సు దినోత్సవం సందర్భంగా సమావేశం నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ.. కరోనా కష్టకాలంలో ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు ఏఎన్‌ఎంలు చేసిన సేవలపై కొనియాడారు. అనంతరం వైద్య సిబ్బందిని, ఆశా వర్కర్లను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి అబ్దుల్ రబ్, కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, సీహెచ్‌ఓ బుర్ర రామయ్య, బ్రహ్మయ్య, అశోక్‌గౌడ్ ఉన్నారు.

### పాడి ఆవు మృతి

**మహమ్మదాబాద్:** విద్యుదాఘాతంతో పాడిఆవు మృతి చెందిన సంఘటన మండలంలోని గాధిర్యాల్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని గాధిర్యాల్ చెందిన ద్యాసమోని దేవమ్మ పాడి ఆవును శుక్రవారం ఉదయం మేత మేసేందుకు వదిలింది. మేత మేసుకుంటూ ట్రాన్స్‌ఫార్మర్ వైపు వెళ్లిన ఆవుకు వైర్లు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ సుమారు రూ.60వేలు ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరింది.

### 13వ రోజుకు చేరిన రిలే దీక్ష

**మహమ్మదాబాద్:** మండలంలోని నంచర్లగేట్ దేశాయిపల్లి వద్ద ఫార్మా కంపెనీ వద్దంటూ యువకులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష శుక్రవారం 13వ రోజుకు చేరింది. దీక్ష నిర్వాహకుడు నర్సింహ మాట్లాడుతూ.. గ్రీన్ జోన్ పరిధిలో ఫార్మా కంపెనీ ఎలా పెడతారని ప్రశ్నించారు. సంబంధిత అధికారులు ఎలా అనుమతులు ఇస్తారని, ఈ ప్రాంత రైతులు, ప్రజలు, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు ఎందుకు సేకరించలేదని ప్రశ్నించారు. కంపెనీ ప్రారంభించకముందే అన్ని గ్రామాల ప్రజలతో బహిరంగ సభను ఏర్పాటు చేసి అభిప్రాయాలు తీసుకుని తగిన నిర్ణయం తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కృష్ణ, పాష, కృష్ణయ్య, చెన్నయ్య, రాజేశ్వర్, కేశవ్, శేఖర్, హరి, ముని, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఫలితాల్లో సత్తా చాటిన ‘సమర్థ’

**మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్:** మండలంలోని సమర్థ ఇంటర్‌నేషనల్ స్కూల్ విద్యార్థులు సీబీఎస్‌ఈ ఎస్సెస్సీ ఫలితాల్లో ప్రతిభ చాటారు. పాఠశాల విద్యార్థులు రిషితారెడ్డి 484, స్ఫూర్తి 481, హర్షిణి 471, స్ఫూర్తి రెడ్డి 471 మార్కులు సాధించారు. ప్రతిభ చాటిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీకాంత్‌కోట, డైరెక్టర్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# సెకండ్‌హ్యాండ్ ఫోన్లు కొంటే జాగ్రత్త

- ఎస్పీ నరసింహ
- జిల్లా కేంద్రంలో ఫోన్ హ్యాండవరింగ్ మేళా

**మహబూబ్‌నగర్ క్రైం:** సెకండ్‌హ్యాండ్ ఫోన్లు కొనుగోలు చేసే వారు చాలా జాగ్రత్తగా ఉండాలని, దొంగతనం చేసిన వాటిని కొంటే ఇబ్బంది పడతారని ఎస్పీ నర్సింహ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. ఈ ఏడాది మార్చి 15నుంచి ఇప్పటి వరకు జిల్లాలో పలు పోలీస్‌స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న, చోరీలకు గురైన సెలఫోన్లను సీఈఐఆర్ యాప్ ద్వారా 44సెల్‌ఫోన్‌లను రికవరీ చేశామని ఎస్పీ తెలిపారు. అనంతరం నిర్వహించిన ఫోన్ హ్యాండవరింగ్ మేళాలో బాధితులకు సెల్‌ఫోన్‌లను ఇచ్చారు. పోయిన సెల్‌ఫోన్ వివరాలను ఐఎంఈఐ నంబర్ ఆధారంగా డేటాను సేకరించామన్నారు. సెల్‌ఫోన్ కోల్పోయిన బాధితులకు పోలీసులు అండగా ఉంటారని, యాప్‌లో ఇప్పటి వరకు 680మంది నమోదు చేశారన్నారు. మరో 47సెల్‌ఫోన్‌లు వేరే రాష్ట్రాల్లో ఉన్నట్లు గుర్తించామని, దీని కోసం ఐటీ కోర్ సిబ్బంది కృషి చేస్తుందన్నారు. సెల్‌ఫోన్ దొంగతనం చేసిన వారిపై కూడా నిఘాపెట్టామన్నారు. మీ వ్యక్తిగత వస్తువుల భద్రత మీరే తీసుకోవాలని ఒకవేళ మొబైల్ దొంగతనం అయినా, పడిపోయినా వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ప్రధానంగా మొబైల్ దుకాణాల నిర్వాహకులు సైతం కొందరు సెల్‌ఫోన్‌లు చోరీ చేసి విక్రయిస్తుంటారని వాటితో జాగ్రత్తగా ఉండాలన్నారు.రికవరీ చేసిన వాటిలో అధికంగా జడ్చర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో 16సెల్‌ఫోన్‌లు ఉన్నాయని, మిగిలిన పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు, మూడు ఉన్నాయని పేర్కొన్నారు.



బాధితుడికి సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్పీ నరసింహ



